

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

జూలై 2024



# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

జూలై, 2024

సంపుటి-3

సంచిక-7

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 03 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 04 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 05 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 06 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 07 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 10 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

శ్రీ మహాగణాధిపతయే నమః    శ్రీ గురుభ్యోనమః    శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం



## సనాతన ధర్మం----స్వధర్మాచరణ

**కర్మ** బంధాలను అన్నింటినీ త్యజించి పరమాత్మని చేరుకోటమే మానవ జీవితం యొక్క పరమౌత్కృష్టమైన లక్ష్యం. దానికి ఏకైక మార్గం స్వధర్మాచరణ. దీని గురించి సనాతనధర్మంలో అనేక సందర్భాలలో ప్రస్తావించబడినది.

శ్లో॥ వరం స్వధర్మో విగుణో న పారాక్యః స్వనుష్ఠితః।
పరధర్మేణ జీవన్ హి సద్యః పతతి జాతితః॥

(మను.అ.10,శ్లో.97)

తన ధర్మము ఎంత గుణహీనమైనప్పటికీని అదియే శ్రేష్ఠమైనది, ఇతరుల యొక్క ధర్మము ఎంత గొప్పదైనప్పటికీ అది శ్రేష్ఠమైనది కాదు. ఎందుకంటే తన ధర్మమునకు మించినది లేదు. పరధర్మాన్ని అనుసరించి జీవితాన్ని గడిపేవాడు పతితుడు అవుతాడు అని మనుధర్మ

శాస్త్ర రుడు తెలియచేసాడు. ఇదే విషయాన్ని గీతాచార్యుడు కూడా విశదపరచాడు.

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః -పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః -పరధర్మో భయావహః

(భగవద్గీత.అ.3.,శ్లో.35)

మంచి ఆచరణ విధానాలు కలిగినటువంటి ఇతరుల యొక్క ధర్మము కంటే, ఎటువంటి సద్గుణాలు లేనటువంటి తన ధర్మం అతి ఉత్తమమైనటువంటిది. తన ధర్మం కోసం ప్రాణాలు అర్పించడం కూడా శుభాన్ని చేకూరుస్తుంది. అంతే తప్ప ఇతరుల యొక్క ధర్మం ఎప్పడు కూడా భయాన్ని కలిగిస్తుంది. దానినే ఇంకా వివరంగా తెలియచేస్తున్నాడు శ్రీ కృష్ణపరమాత్ముడు.

శ్లో॥ స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః|
స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు॥

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్|
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః॥

(భగవద్గీత. అ 18. శ్లో 45-46)

'సాధకుడు తన సహజ కార్యకలాపాలలో శ్రద్ధతో నిమగ్నమైనప్పడే భగవంతుడిని దర్శనాన్ని పొందే అత్యున్నత భాగ్యాన్ని పొందుతాడు. సకల జీవరాశులలో జీవమై నిలచి, సమస్త విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆ భగవంతుడిని పూజించడం ద్వారా (సేవ చేయడం) ద్వారా, మానవుడు పరిపూర్ణతను పొందుతాడు.' పరమాత్మ ఈ ప్రపంచానికి మూలకర్త'. ఆయన సృష్టి, స్థితి, లయ కారకుడు, పరమశ్రద్ధతో, విశ్వాసంతో పనులన్నింటినీ చేస్తూ, ధర్మాసక్తి కలిగి, ఎటువంటి ఫలాపేక్ష లేకుండా త్యాగముతో చేసేటువంటి పనులన్నీంటిని భగవంతుడు ఆశీర్వదిస్తాడు. ఈ శ్లోకంలో నరుడు మరియు మానవుడనే శబ్దాలను భగవంతుడు తెలియపరుస్తూ ప్రతి ఒక్క మనిషి అతడు ఎటువంటి జాతివాడైనా కూడా తన యొక్క కర్మల చేత భగవంతుడిని పూజించి సిద్ధి పొంది పరమాత్మను చేరుకోగలుగుతాడు. పరమాత్మను చేరుకోవడమే మానవుని యొక్క అంతిమ లక్ష్యం. దానికి అనుగుణంగా మానవుడు తన విద్యుక్తకర్మలను ఆచరించి భగవంతుని చేరుకుంటాడు. ఇది చాలా మంచి మార్గం మానవుడు చేసే ఏ పనినైనప్పటికీ కూడా నిష్కామభావంతో, తత్పరతతో ఆచరించినట్లయితే పెద్ద పెద్ద ఆపదలు ఎదురైనప్పటికీ కూడా ధర్మాన్ని మాత్రం త్యాగం చేయరాదు.

శ్లో॥ న జాతు కామాన్ భయాన్ లోభాత్ ధర్మ త్యజేజ్జీవితస్యాపిహేతోః|
నిత్యో ధర్మం: సుఖదు:ఖే త్వనిత్యే నిత్య జీవో ధాతురస్య త్వనిత్య: ||

( మహాభారతం స్వర్గారోహణం: 5.63)

అనగా ఒక వ్యక్తి కోరికతోనో, భయంతోనో లేదా దురాశతోనో, ప్రాణరక్షణకై కూడా ధర్మాన్ని వదిలి పెట్టకూడదు. ధర్మం శాశ్వతమైనది, సుఖదుఃఖాలు అనిత్యములు, క్షణికమైనవి కాబట్టి నీతినియమాలను విడిచిపెట్టకూడదు. మూర్తీభవించిన ఆత్మ శాశ్వతమైనది. స్థూల శరీరం ఎప్పడైనా నశించేదే. కావున సాధకులు, గురుభక్తులెల్లరు స్వధర్మాచరణకై కంకణబద్ధులై, నిస్వార్థస్ఫూర్తితో తమ ధర్మాన్ని శ్రద్ధగా అనుసరించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను..

వద్దిపర్తి పద్మాకర్

శ్రీ ప్రణవపీఠం వారి
విద్యా నిధి
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



**నారదుడు** మరలా నారాయణునితో ఇలా అన్నాడు — వినాయకుడు ఒక్కొక్క కల్పంలో ఒక్కొక్క కారణంతో ఏకదంతుడవుతాడని విన్నాను. పరశురాముని వల్ల గణపతి ఏకదంతుడయ్యాడని కొందరంటున్నారు. ఈ కథను నాకు వివరించు.నారాయణుడు ఆ కథను వివరించసాగాడు — తన తండ్రికి ద్రోహం చేసినందుకు ఒకప్పుడు కార్తవీర్యార్జునుని, ఆగ్రహింతో సంహరించాడు పరశురాముడు. అక్కడితో ఆగక, అతని పుత్రులు తలపెట్టిన ఘోరకృత్యాలకు కలత చెంది ఇరవై ఒక్క మారులు క్షత్రియులను సంహరించి భూమిని కశ్యపునకు దానం చేసాడు. పరశురాముని కీర్తి సర్వలోకాలలోనూ వ్యాపించింది. అతని వద్దకు బ్రహ్మ, భృగువు, ఇంద్రుడు, వాల్మీకి, చ్యవనుడు, జమదగ్ని వచ్చారు. వారిని అందరినీ గౌరవించాడు భార్గవరాముడు. వారు అతనికి దర్భలు, పూవులు ధరించిన చేతులతో ఆశీస్సులు అందించారు. అప్పుడు బ్రహ్మ భార్గవరామునితో ఇలా అన్నాడు — నాయనా! ధర్మ మార్గాన్ని నెలకొల్పడానికి క్షత్రియ సంహారం చేసావు. ఇందులో కొంత న్యాయం, కొంత అధర్మం ఉన్నాయి. దుష్టులను చంపడం న్యాయం. కాని అనవసరంగా కొందరు క్షత్రియులను చంపడం అన్యాయం. ఈ పాపానికి ప్రాయశ్చిత్తం కావలసినదే. గురుదర్శనమే దీనికి తగిన ప్రాయశ్చిత్తం. కాణ్వశాఖలో ఉన్న విషయం చెపుతున్నాను విను. జన్మనిచ్చిన తండ్రి కంటె, అన్న వస్త్రాలతో పోషించిన వాడే గొప్పవాడు. జన్మనిచ్చిన వాడు జనకుడు. అన్న వస్త్రాలతో పోషించినవాడు 'పిత' అనబడతాడు. పితకంటె, కడుపులో మోసి కన్నతల్లి గొప్పది. ఆమెను 'మాత' అంటారు. మాత, పిత కంటె వందరెట్లు గొప్పది. మాతాపితరులకంటె ఇష్టదేవత గొప్పది. ఇష్టదేవత మనకు కావలసినవి ప్రసాదిస్తుంది. ఆ ఇష్టదేవత కంటె జ్ఞానం, విద్య, మంత్రాలను ప్రసాదించే గురువు గొప్పవాడు.

శ్లో॥ దేవే రుష్టే గురూ రక్షేత్, గురౌ రుష్టే న కశ్చన ॥
(బ్ర.వై.పు.తృ.ఖం.అ.40.శ్లో.88)

దేవునికి కోపం వస్తే గురువు రక్షించగలడు. [శిష్యుని రక్షించే బాధ్యత గురువు తీసుకొంటాడు] గురువునకు కోపం వస్తే రక్షించే వాడు ఎవ్వడూ లేడు.


శ్లో॥ గురుర్ బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురురేవ పరం బ్రహ్మ బ్రాహ్మణేభ్యః ప్రియః పరః
(బ్ర.వై.పు.తృ.ఖం.అ.40.శ్లో.89)

...ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## శ్రీ వెంకటాద్రి పై నరసింహస్వామి - శివునితపస్సు




**నా** ఇష్టం వచ్చిన వాడితో తిరుగుతూ, తిరుగుతూ గోదావరీతీరంలోని ఒక ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ ఒక సన్యాసి కనిపించాడు. అతనికి భక్తులు ఇచ్చిన ధనంతో, అతడొక ఆశ్రమ నిర్మాణం చేసి, అన్నదానాలు, జలదానాలు చేస్తూ, పురాణకథలను భక్తులకు వినిపిస్తూ పవిత్రంగా కాలం గడిపేవాడు. అతని ఆశ్రమం, ధనం అపహరించి, అతనితో కామోపభోగాలు అనుభవించాలనే కోరిక నాకు కలిగింది. భక్తురాలివలె నటించి, నాకు మంత్రోపదేశం చేయమని ఆయన కాళ్ళు పట్టుకొన్నాను. ఆ గురువు జాలిపడి నన్ను తన శిష్యురాలిగా స్వీకరించాడు. ఆ క్రమంలో కొంత కాలం ఉన్నాక, నా వెకిలిచేష్టలతో ఆయనను ఆకట్టుకొని, కాముకుడిని చేయడానికి ప్రయత్నించాను. కాని, ఆయన నా వలలో పడలేదు. నా వికృత చేష్టలను గ్రహించలేక పోయాడు. ఆయన ఆశ్రమాన్ని, ధనాన్ని వశం చేసుకోవాలి అనే కోరిక నాలో పెచ్చు పెరిగింది. చివరకు అన్నింటికీ తెగించి, ఒకనాడు ఆయన పురాణం చెపుతూ ఉండగా నలుగురిలో ఆయన మీద పడి కౌగిలించుకొన్నాను. ఆపై భక్తులతో, ఈ సన్యాసి నాకు ప్రియుడనీ, గురుపదానికి అనర్హుడనీ, నన్ను మానభంగం చేసి పెళ్ళి చేసుకొంటానని పలికాడనీ అభాండాలు వేసాను. భక్తులు నా మాట నమ్మారు. ఆ సన్యాసిని రాళ్ళతో కొట్టారు. అవమానించారు. ఇంత జరిగినా ఆ సన్యాసి ఏమీ మాట్లాడలేదు. నన్ను చిత్రంగా చూసాడు. ఆశ్రమాన్ని వదలి నిర్వికారంగా ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆయన చూపు కాని, ఆయనకు జరిగిన అవమానం కాని నన్ను ఏమాత్రం మార్చలేకపోయాయి. ఆయన వెళ్ళిపోగానే ఆశ్రమాన్ని భక్తులు నాకు ఇచ్చారు. నా వ్యసనాలతో ఆశ్రమాన్ని వేశ్యాగృహంగా, ద్యూతగృహంగా, మద్యపానకేంద్రంగా మార్చాను. అప్పటికి ప్రజలకు నా గురించి తెలిసింది. వారంతా నన్ను అసహ్యించుకొన్నారు. రాళ్ళని విసిరారు. ఒక సద్గురువును పాడుచేసి, ఆశ్రమానికి దూరం చేసి, అభాండాలు వేసిన పాపాత్మురాలిని. నన్ను ఈ కుష్ఠరోగం పట్టుకొంది. ఈ రోగం నా భయంకర పాపాల రూపం. పది సంవత్సరాలుగా ఈ భయంకర రూపంతో, రోగబాధతో, తిండి తినలేక గిలగిలలాడుతున్నాను. నా శరీరం దుర్వాసనతో నిండిపోయింది. శరీరబాధ, మానసిక బాధలతో జీవచ్ఛవంలా ఉన్నాను. నాకు తెలుసు, నా పాపాల వలననే ఈ భయంకరరోగం వచ్చిందని.పాపతాపశాపాల నుండి నన్నుద్ధరించే వారెవరూ లేరు. కానీ నా భాగ్యం వల్ల దేవలుడు అనే మహర్షి ఇక్కడకు వచ్చాడని భక్తులు అనుకుంటే విని ఇక్కడకు వచ్చాను. మీరే దేవలుడని గ్రహించాను.

.... ఇంకా ఉంది

*****

# పురాణం లో మహిళలు

## రుక్మిణి



'శ్రీహరిని భర్తగా పొందే అదృష్టం కలుగచేయి తల్లీ' అని గౌరిదేవికి మొక్కుకుంది.

నమ్మితి నా మనంబున సనాతునులైన యుమామహేశులన్ మిమ్ము బురాణ దంపతుల మేలు భజింతు గదమ్మ మేటి పెద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరింబతిసేయమ్మనిన్ నమ్మిన వారి కెన్నటికి నాశము లేదు గదమ్మ యీశ్వరీ

- - -- - -.. అంటూ ప్రార్థించింది.

శ్రీకృష్ణుడ్ని మనసులో నిలుపుకుని ఆలయంనుంచి బయటకు వచ్చింది. ద్వార సమీపంలో శ్రీకృష్ణుడి దివ్యరథం కనిపించింది. దాన్ని చూసి ఆమె ఆనందంతో, సిగ్గుతో తల వంచుకుని, మెల్లగా అటు అడుగులు వేసింది. శ్రీకృష్ణుడు రథం దిగివచ్చి తనకు నలువంకలా వున్న రాజులెవ్వరినీ లక్ష్యపెట్టకుండా ముందుకు వెళ్ళి రుక్మిణీదేవి చెయ్యి పట్టుకుని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. రథంలో ఎక్కించుకున్నాడు. విజయశంఖాన్ని పూరించి రథాన్ని ద్వారకానగరంవైపు పరుగు తీయించాడు. జరాసంధుడు అది చూశాడు. అతనికి అమితమైన ఆగ్రహం కలిగింది. జరాసంధుడూ, అతని స్నేహితులూ సైన్యాలను తరలించుకుని యాదవవీరులను తరుముకుంటూ వెళ్ళారు. ఇరుపక్షాలకూ మధ్య ఘోర యుద్ధం జరిగింది. కృష్ణుడు శరవర్షం కురిపించాడు. జరాసంధుడి రథాలను కూల్చాడు.గజాలను సంహరించాడు. గుర్రాలను వధించాడు. సైనికులను హతమార్చాడు. అదంతా తెలిసిన రుక్మి తన చెల్లెలిని కృష్ణుడు అపహరించుకుపోవటం సహించలేక ఒక అక్షౌహిణి బలంతో యాదవుల మీదికి ఉరికాడు. అప్పుడు కృష్ణుడు రుక్మి కోదండాన్ని ఖండించాడు. రథాన్ని కూల్చాడు. అతడ్ని తీవ్రంగా గాయపరిచాడు. నిరాయుధుడై నేలపై నిలిచిన రుక్మికి సంభవించబోయే ఆపదను రుక్మిణి అర్థం చేసుకుంది. హడలిపోయింది. శ్రీకృష్ణుని పాదాల మీద పడి తన అన్నకు ప్రాణభిక్ష ప్రసాదించమని వేడుకుంది.శ్రీకృష్ణుడు. రుక్మిణి ప్రార్ధన మన్నించి రుక్మిని సంహరించకుండా వదిలేసాడు. రుక్మి తనకు జరిగిన పరాభవానికి అమితంగా విచారపడి, శ్రీకృష్ణుని గెలిచిగానీ కుండిన నగరంలో ప్రవేశించనని ప్రతిజ్ఞ చేసి, అప్పటి నుంచి భోజకటంలో వుండిపోయాడు. ద్వారకలో రుక్మిణీకృష్ణుల వివాహం వైభవంగా జరిగింది. ఇలా రుక్మిణీ, కృష్ణుల కళ్యాణం జరిగింది.

*****

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 333. వారుణీమదవిహ్వలా [ఓం ఐం హ్రీం శ్రీం వారుణీమదవిహ్వలాయై నమః]



లోకాలన్నింటినీ భరిస్తూ కూడా తొట్రుపాటు పొందనిది అని ఒక అర్థం. ఆనందాన్ని ఇచ్చే తేనె లేక మధువును స్వీకరించి, మత్తుగా కనిపించునది అని మరొక అర్థం. ఆనందమనే మధువు మత్తునే ఇస్తుందిగదా! తానెవరో తెలుసుకొని ఆనందంలో విహరిస్తున్నది అని నిగూఢార్థం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

తీవ్ర దుఃఖాలను తొలగించే మంత్రమిది. తేనె, బెల్లం కలిపి అమ్మవారికి నివేదించి, 45 దినాలు, దినమునకు 263 సార్లు చొప్పున ఈ మంత్రాన్ని జపించి, నైవేద్యాన్ని ప్రసాదంగా స్వీకరించినవారి దుఃఖాలు తొలగిపోతాయి. సుఖశాంతులతో ఆనందంగా జీవించ గలుగుతారు.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

ఓం ఐం హ్రీం శ్రీం వామనయనాయై నమః

# ఋషి చరిత్ర

## భారద్వాజ ఋషి

భారద్వాజ ఋషి : జటిలం తపసాసిద్ధం యజ్ఞ సూత్రాక్ష ధారిణమ్|
కమండలు ధరం నిత్యం భరద్వాజం నతోస్మ్యహమ్||

**ఓం సుశీలా సహిత భరద్వాజాయ నమః**

**రామాయణంలో** శ్రీ రాముడు సీత మరియు లక్ష్మణులతో పాటు తన తండ్రి మాట కోసం వనవాసానికి వెళ్ళాడు. రాముడు వారితో పాటు సరయూ నదిని దాటడం నుండి మొదలుకొని అనేక అటవీ ప్రాంతాల గుండా ప్రయాణిస్తున్నప్పుడు అతను అనేక ఋషుల ఆశ్రమాలను సందర్శించాడు. అగస్త్యుడు, గౌతముడు మరియు భారద్వాజ మహర్షితో సహా అనేకమంది ఋషులను కలుసుకున్నాడు. శ్రీ రాముడు మరియు ఇతరులు ప్రయాగ దాటినప్పుడు భరద్వాజుని ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు మరియు శ్రీ రాముడు మహావిష్ణువు యొక్క అవతారమని, సీతాదేవి లక్ష్మీదేవి అని మరియు లక్ష్మణుడు మరెవరో కాదని గొప్ప ఋషులకు తెలుసు. భారద్వాజ ఋషి అనేక శాస్త్రగ్రంథాలను రచించారు. అందు 'అంశుబోధిని' అను గ్రంథమొకటి. ఈ గ్రంథమందు గ్రహములకు చెందిన సమాచారము - కాంతి (లైట్) ఉష్ణము (ఉష్ణశక్తి -నేడు హీట్ అంటున్నాం), ధ్వని శాస్త్రము (సౌండ్), విమాన నిర్మాణ విధి విధానములు, విద్యుచ్ఛక్తి దాని ప్రయోగ విషయముల వంటి అనేక శాస్త్ర విషయాలు చెప్పబడ్డాయి. భారద్వాజ స్మృతి పేరిట ధర్మశాస్త్రాన్నందించారు. భారద్వాజ మహర్షి 'ఆకాశతంత్ర' మను మహాగ్రంథాన్ని రచించారు. దీనియందు నేటి శాస్త్రవిజ్ఞానానికి తెలియని అనేక విశేషాలను వివరించారు. ఏడు విధములైన ఆకాశములను, ఆకాశనేత్రావిభాగాలను, ఆకాశంలో జరిగే అనేక శక్తి సంయోగ వివరాలు, ఆకాశమునందలి భూములు (సూపర్ ఎర్త్) ఆకాశంలోని కాంతి, శక్తి, అగ్ని, గ్రహములు, గ్రహ కక్ష్యలు, టెలిఫోన్ వంటివి దీనిలో వివరించబడ్డాయి. ఆధునిక శాస్త్రవేత్తలకు ఆకాశతత్వము, దాని ఆద్యంతములే పూర్తిగా అవగతమగుట లేదు. భారద్వాజమహర్షి పురాణకాలంలో 32 రకాల విమానాల గురించి వివరించారు. భారద్వాజమహర్షి యుద్ధ విమానాల గురించి కూడా తన బృహత్ విమాన యంత్ర శాస్త్రంలో వివరించారు. ఏ లోహాలతో విమానాన్ని తయారుచేయాలి. ఎటువంటి ఇంధనాన్ని వాడాలి, పైలట్లు ఆహార వస్త్రధారణ నియమాలవంటివి తెలియజేశారు మయుడు, భారద్వాజ మహర్షి 16 రకాల విమానలను చెప్పి వాటిని మరలా ఒక్కొక్కదానిని 8 తెగలుగా విభజించి 128 రకాలుగా వివరించి చెప్పారు..

*****



# కాశీ కథలు



శంకుకర్ణుడు,మహాకాలుడు ఇరువురు తిరిగి రాకపోయేసరికి మరో ఇరువురు గణములను కాశీకి పంపెను శివుడు. ఘంటకర్ణుడు,మహోదరుడు అను పేర్లు గల ఇరువురు శివ గణములను పిలిచి మీరు శీఘ్రంగా కాశీకి వెళ్ళండి, అక్కడ జరిగినవి,జరుగుతున్నవి తెలుసుకొని నా వద్దకు రండి అని ఆజ్ఞాపించెను.శివుని ఆదేశంతో కాశీకి వెళ్లి అక్కడే ఉండిపోయిరి.ఈరోజుకు కూడా వారు కాశీ యందే ఉన్నారు. కాశీని వదిలి వారు వెళ్లలేదు.ఘంటకర్ణుడు ఘంటకర్ణేశ్వర అనే లింగమును స్థాపించెను. ఘంటకర్ణుడు స్నానార్థము ఒక కుండమును కూడా నిర్మించెను. మహోదరుడు మహోదరేశ్వర లింగమును స్థాపించెను. మహోదరేశ్వర లింగమును దర్శించుకున్న వారు ఎక్కడ మృతి చెందినా కాశీలో మృత్యువు వలన కలుగు ఫలితమును పొందుతారు. ఈ కుండము వద్ద పితృకార్యములు నిర్వహిస్తే పితృదేవతలు సంతోషిస్తారు. ఇక్కడ తర్పణములు వదిలిన వారికి పరమ సిద్ధులు కలుగుతాయి. ఘంటకర్ణుడు, మహోదరుడు కూడా రాకపోవడం చూసి తీవ్రంగా చింతించాడు శివుడు.ఓ కాశీ పట్టణమా నీ మహిమకు ఎంతటి వారైనా దాసులు కావలసిందే అని భావించాడు శివుడు.సోమనంది నందిషేణ, కాల,పింగల, కుక్కుట అను నామములు కల పంచ ప్రమథ గణములను కాశీ పట్టణమునకు పంపెను. వీరు కూడా కాశీ మహత్తును తెలుసుకొని కాశీ యందే ఉండిపోయినారు.



...ఇంకాఉంది

*****

# స్తోత్రమాలిక

## శ్రీ శ్రీ శంకర భగవత్పాద కృతం శ్రీ గణేశ పంచరత్నమ్

1.ముదాకరాత్తమోదకం సదా విముక్తి సాధకం

కలధరావతంసకం విలాసిలోకరక్షకమ్ l

అనాయకైకనాయకం వినాశితేభదైత్యకం

నతాశుభాశునాశకం నమామి తమ్ వినాయకం ll

2.నతేతరాతిభీకరం నవోదితార్క భాస్వరం

నమత్సురారినిర్జరం  నతాధికాపదుద్ధరమ్ l

సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం

మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరంతరమ్ ll

3.సమస్తలోకశంకరం నిరస్తదైత్యకుంజరం

దరేతరోదరం వరం వరేభవక్త్రమక్షరమ్ l

కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం

మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్ ll

4.అకించనార్తిమార్జనం చిరంతనోక్తిభాజనం

పురారిపూర్వనందనం సురారిగర్వచర్వణమ్ l

ప్రపంచనాశభీషణం ధనంజయాదిభూషణం

కపోలదానవారణం భజే పురాణవారణమ్ ll

5.నితాంతకాంతదంతకాంతిమంతకాంతకాత్మజమ్

అచింత్యరూపమంతనహీనమంతరాయకృన్తనమ్ l

హృదంతరే నిరంతరం వసంతమేవ   యోగినాం

తమేకదంతమేవ తం  విచిన్తయామి సంతతమ్ ll

6.మహాగణేశ పంచరత్నమాదరేణ యోన్వహం

ప్రజల్పతి  ప్రభాతకే హృదిస్మరన్ గణేశ్వరమ్l

అరోగతామదోషతాం సుసాహితీమ్ సుపుత్రతాం

సమాహితాయురష్ట భూతిమభ్యుపైతి సోచిరాత్ ll

*****

# గురుదేవుల జీవన కవనము

## నవదశ అధ్యాయము



పూజ్య గురుదేవులు ఆంగ్లంలో నైపుణ్యమును కూడా ఇక్కడ ప్రదర్శించడం జరిగింది. సాయంకాలం వేళలలో ఇక్కడ గురువుగారికి అనేక అనుభూతులు కలిగేవి.గురువుగారు శ్రీనీలకంఠేశ్వర  అనే శతక రచనను ప్రారంభించారు. 1988లో సత్యసాయి సప్తశతి అను పేరుతో సత్యసాయి గురించి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు రచించారు. గురుదేవులు పురాణములను ప్రవచించటమే కాదు మృదు భాష లో భక్తులు అందరికీ అర్థం అయ్యేలా పురాణములను తెలుగు లో పుస్తకాల రూపం లో కూడా అందించారు. దేవీ భాగవతం, శివ పురాణం, శ్రీ వేంకటేశ్వర విలాసం వంటి పుస్తకాలు అనేకం అందించారు.వాడుక భాష లో, సామాన్యులకు కూడా అర్థం అయ్యే లాగ రచించటం వారి ప్రత్యేకత.శ్రీ గురువుగారు రచించిన మానవ కథ అత్యద్భుతం. 1989 సంవత్సరం గణపవరం లో శ్రీ మద్భాగవతం 40 రోజులు ప్రవచించారు. మొదటి రోజు 7 మంది ఉన్న శ్రోతలు వారం పూర్తి అయ్యేసరికి వెయ్యి మంది అయ్యారు.వారి ప్రవచన ధారలు రోజు రోజుకి ఉధృతం అయ్యాయి. చిన్న పాయగా జన్మించిన గోదావరి భద్రాచలము దాటిన తర్వాత అఖండ గోదావరి అవుతుంది. గురువుగారు ప్రవచనము కూడా గోదావరి ప్రవాహమే.శుక మహర్షి తర్వాత పురాణములను అంత లోతుగా చెప్పగల సామర్థ్యము ఒ వద్దిపర్తి పద్మాకర్ గారికి ఉన్నది.కలి కాలంలో జీవులకు డబ్బు పైన ఆశ ఎక్కువ, కోరికలు అనే వ్యామోహం లో పడి గొప్ప గొప్ప వారు కూడా నశించిపోతున్నారు. ధర్మ సంస్థాపన మాత్రమే ధ్యేయంగ పని చేస్తున్న గురువుగారు అగ్ని స్వరూపులు. అగ్ని ఎంత పవిత్రమో గురుదేవులు అంతటి పవిత్రం.సంపదలు భోగాలు అన్నిటినీ త్యజించి అగ్ని వంటి స్వచ్ఛమైన కాంతి కలిగి ఉన్నారు. వారి ప్రతి మాట ఒక నిప్పు కణిక. వారి నుండి వచ్చే ప్రతి వాక్కు సత్యమే. మర్యాద పురుషోత్తముడు రాముడు అని మనము విని ఉంటాం, కానీ పద్మాకర్ గారి రూపం లో రాముడిని చూస్తున్నాం. రాముడు ఎలా రాజ్యాన్ని కూడా తండ్రి కొఱకు వదిలివేసాడో, గురువుగారు సంపదలను, భోగాలను,ధనమును కూడా ధర్మం కోసం త్యాజించారు.

.... ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

శ్రీ ప్రణవపీఠం వారి

# గుడి-బడి

ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

